# విచారింపు

(ఆంధ్ర పత్రిక 1980)

మరణించిన వ్యక్తి తాలూకు ఆత్మీయుల్ని పరామర్శించి సాను భూతి చూపడమనేది మన ఆచారం.

ఈ ఆచారాన్ని మన పెద్దలు ఎందుకు పెట్టారంటే ప్రియమైన వ్యక్తిని పోగొట్టుకున్న విచారంలో ఆ శూన్యంలో మనసుకు కొంత ఓదార్పు, నాకు వీళ్ళంతా వున్నారనే ధైర్యం అవసరమని.

ఈ విచారింపు వాంఛనీయమైనదే. ప్రేమించి, ప్రేమించబడ్డ వ్యక్తి తాలూకు నిష్క్రమణా విషాదగాయాన్ని కాలం మాన్పుతున్న రోజుల్లో ఆ గతించిన స్మృతిని విచారింపు పేరిట తట్టి లేపడం సాంప్రదాయం కాకూడదు. ఏడుస్తున్న వ్యక్తి కన్నీళ్ళు తుడవాలే కానీ తన కన్నీటిని తనే తుడుచుకున్న మనిషి గుండె కన్నీరు కార్చేలా చేయకూడదు.

—జయప్రద

మా అమ్మ చనిపోయింది. అయినా నాకు షాక్ రాలేదు. షాక్ రావాల్సిన విషయమే అయినా నాకు షాక్ రాలేదు. నిజం!

ఈ ప్రపంచంలో నాకంటూ వున్న ఒకే ఒక వ్యక్తి మా అమ్మ. ఆమెకూడా నన్నొదిలిపోయినా నాకు షాక్ రాలేదంటే నాకే ఆశ్చర్యంగా వుంది, దిగులుగావుంది, విభ్రాంతిగా వుంది.

ఆమె చనిపోతే అని అనుకొన్న కొన్నివేల లక్షల క్షణాల్లో నాలో కలిగిన భయం ఆందోళన ఈరోజు నాలో లేదు. ఏదో శూన్యం నాకు అర్థంకాని శూన్యం మాత్రం నన్ను చుట్టేసింది.

నా కాళ్ళలోశక్తి నశించిపోలేదు. మా అమ్మ మృతశరీరం అక్కడలా నేలమీద వుండగానే నన్నెవరో బలవంతంచేసి కాఫీ ఇస్తే అదీ తాగాను.

మా అమ్మ శరీరం కూడా ఇంకొన్ని గంటల్లో నాకు దూరమయి పోతుందని తెలిసినాకూడా అది నిద్రో అలసటో నాకు తెలియకుండానే ఒక గంటసేపు కన్నుమూసాను. నిద్రలో ఉలిక్కిపడి లేచి చూస్తే మా అమ్మ అలాగేవుంది. అమ్మవేపు చూస్తూ కూర్చున్నాను.

ఆ అర్ధరాత్రి మా ఇంటినిండా జనం, కొందరు నిద్రపోతూ, కొందరు తిరుగుతూ, కొందరు మా అమ్మచుట్టూ కూర్చుని అప్పుడప్పుడు శ్మశాన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఏడుస్తూ-

'అమ్మా' నా గుండెలు పిలుస్తున్నాయి. నా కళ్ళు తదేకంగా మా అమ్మ ముఖంవంక చూస్తున్నాయి. చైతన్యాన్ని కోల్పోయిన ఆమె ముఖం వంకే చూస్తున్నాయి. అలా చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను. అమ్మ కళ్ళు తెరిచినట్లయింది. నిద్రలోనుండి మేల్కొన్న భ్రాంతి. నా గుండె జల్లుమంది.

ఒక్కసారి వెళ్ళి అమ్మ ప్రక్కన పడుకుంటే ఆమె చేతులు నన్ను పెనవేసుకుంటే ఆ స్వాంతన నాకింకెక్కడ దొరుకుతుంది?

కాని మా అమ్మచేతులు తాళ్ళతో కట్టేసారు. ఆమె తెల్లటిచేతులు ఆర్తిగా నన్ను తడుముకునే ఆ చేతులు తెల్ల బెడ్‌షీట్ వెనక వున్నాయి.

అవి నాకు కనపడవు. ఇంకొన్ని గంటల్లో ఆ అందమైన ముఖము, ఆ మెత్తటిచేతులు అన్నీ కాలి మసి అయిపోతాయి.

ఆ ఆలోచనకే అదిరిపడ్డాను. కానీ నాకుతెలుసు జరగబోయేదదే. ఆ ఆలోచనను నాలోకి రానీకుండా వుండను బలవంతంగా ఆలోచనను మార్చాను. మా అమ్మ నన్ను అపురూపంగా చూసుకున్న రోజుల్లోకెళ్ళిపోయాను.

ఇంతకీ నాపేరు చెప్పనేలేదు. నా పేరు సౌందర్య. ఆ పేరు అసలు నాకు పెట్టాలని మా అమ్మకెందు కనిపించిందో! నేను సౌందర్యవతిని కాను—పోనీ నేను సౌందర్యవతిని కాననే విషయం నేను పది రోజులు పసిగుడ్డుగా వున్నప్పుడు తెలీదనుకుందామా అంటే అదీ అబద్ధమే-నేను పుట్టగానే కురూపిగా పుట్టాను. ఏ జీన్ సరిగా పడలేదు. నాకు పైపెదవి పూర్తిగాలేదు. డాక్టర్లు హేర్‌లిప్ అంటే మావాళ్ళు గ్రహణశూల అన్నారు. పాపం అప్పటికే మా నాన్న నాకు దాన్ని గురించి ఆపరేషన్ చేయించారు.

అయినా బాగరాలేదు. నా ఎడమకంట్లో మెల్ల దానికి మాత్రం మా నాన్న ఆపరేషన్ చేయించలేదు. మెల్ల అదృష్టమట నాలాటివాళ్ళను ఓదార్చడానికి పెట్టిన సామెత అయ్యుంటుంది. లేకపోతే నా అదృష్టమిలా ఎందుకు తెల్లారింది?

ఆ రెండూ చాలవన్నట్లు నా ముఖం తయారీయె అస్తవ్యస్తంగా వుంది.

ఎత్తుగా వుండాల్సినచోట పల్లం, పల్లం వుండాల్సిన చోట ఎత్తు—ఇంత అందమైన అమ్మకు నేనెలా పుట్టాను? అయినా పాపం అమ్మ నన్ను అసహ్యించుకునేదికాదు. నన్ను నా అందవిహీనమైన పెదాల్నే ముద్దాడేది.

"అయ్యో! అయ్యో సత్యవతీ! నీకప్పుడే నూరేళ్ళు నిండిపోయాయా తల్లీ" గోలుగోలున ఏడుస్తూ వచ్చింది మా పెద్దమ్మ-వాళ్ళి

ద్దరూ మంచి స్నేహితులు కూడా. మా పెద్దమ్మ ఏడుపు నా గుండెల్లో ఘనీభవించిన విషాదాన్ని తాకింది.

ఆమె ఏడుపులో ద్రవీభవించిన విషాదం నా గుండెల్లోనుండి దుముకి నా కళ్ళల్లోకొచ్చి అక్కడనుండి నా చెంపలమీదుగా జారి పోయింది. ఇంకా ఇంకా నా గుండెల్లోనుండి దుమికి దుమికి నా నిగ్రహ శక్తి నధిగమించి వచ్చిన విషాదం వెక్కిళ్ళుగా మారింది. ఎవరో నా భుజంమీద చెయ్యి వేసారు.

"సర్దుకో....సర్దుకోమ్మా! రేపు చచ్చిపోయే మనం ఇప్పుడు చచ్చి పోయిన అమ్మ గురించి ఏడవడం తెలివి తక్కువ"

ఆశ్చర్యపోయి తలెత్తాను. ఆమె ఎవరో నాకు తెలియదు కానీ ఎంత గొప్ప సత్యం చెప్పింది

కొద్దిసేపు ఏడ్చేసాక నా గుండెల్లో భారం తగ్గింది. మా పెద్ద మ్మకు థాంక్స్ చెప్పుకున్నాను. మా పెద్దమ్మ కూడా ఏడవడం మానే సింది. శోష వచ్చి పడుకొని నిద్రపోతోంది.

ఇదేమిటిది? అమ్మ చనిపోయుంటే తనివన్నీ ఎలా ఆలోచిస్తోంది. అసలు ఆలోచించే శక్తి తనకింకా ఎలాగుంది?

అలా నేను విభ్రాంతిలో, విషాదంలో, విచారంలో, విరక్తిలో మునిగి తేలుతుండగా తెల్లవారింది. మా చిన్నాన్న కొడుకు బరువయిన పూలమాల తెచ్చి మా అమ్మకేసాడు

మరలా నా గుండెల్లో గుబగుబలాడే విషాదం-అమ్మ ఇక ఎన్నో గంటలు వుండదు.

ఎవరి ఒడిలోనైనా తల దూర్చి భోరున ఏడవాలనుంది. ప్రక్కనే మా దూరపు బంధువు ఒకామె కూర్చొనుంది ఆ క్షణంలో నాకెవరైనా ఒకటే.

ఆమె భుజంమీద తలానించాను.

ఆమె ఆ తలమీద చెయ్యివేసింది.

"పాపం! సౌందర్యను చాలా అన్యాయంచేసి పోయింది సత్య వతి."

"నాకేదో కొత్త సత్యం తెలిసినట్టయింది. అవును నిజమే-ఇంకె వరు పిలుస్తారు నన్ను పాపా అని అన్నం తిన్నావా పాపా! అని ఇంకె వరు అడుగుతారు? ఇంట్లో పిలుచుకోను, పలకరించుకోను, ఓదార్చు కోను, కబుర్లు చెప్పుకోను నాకింకెవరుంటారు?" సెల్ఫ్‌పిటీ.

మరలా దుఃఖం ముంచుకొచ్చింది.

అమ్మ పాపం ఎప్పుడూ గొడవ పెడుతూనే వుండేది—ప్రయి వేట్‌గానయినా చదువుకుని బి.ఏ. అన్న పాసయి ఏదయినా చిన్న ఉద్యోగమైన చూసుకోమని.

ఊహుఁ! తనకు తెలివీలేదు, పట్టుదలాలేదు, దాంతో పదోక్లాసైనా దాటనేలేదు వైలెన్ మీద అన్ని రాగాల్ని గుర్తుపెట్టుకున్న నాకు చదువు మాత్రం గుర్తుండేది కాదు.

ఇన్నాళ్ళు అమ్మ వుంది కనుక ఉద్యోగం లేకపోయినా పెళ్ళి సంసారం లేకపోయినా నెట్టుకొచ్చింది. కానీ ఇక ఎలా? ఏదీ లేకుండా ఎలా బ్రతకడం?

ఇదేవిటీ? నేను నా గురించి ఆలోచించుకుంటున్నానేమిటీ? ఎంత స్వార్థపరురాల్ని నేను?

కానీ అమ్మ గురించి ఏమాలోచించాలి?

అమ్మ గురించి ఆలోచించాల్సి వస్తే ఆమె హాయిగా, శాశ్వతంగా నిద్రపోతున్నందుకు ఆమెను చూసి అసూయపడాలి.

లేదా మరి కొన్ని గంటల్లో ఆమె శరీరం అగ్నిలో మాడిపోతుం దనే భావాన్ని గుర్తుచేసుకుని నా గుండెల్ని నేను మండించుకోవాలి.

పాపం! చనిపోయి సుఖపడింది! బ్రతికి ఏం చూడాలి గనక? అవిటికూతురి దురదృష్టం తప్ప జీవితం తప్ప అని అమ్మమీద-నామీద కూడా కాస్సేపు జాలిపడ్డాను.

పూర్తిగా తెల్లవారిపోయింది. కాఫీలు పట్టుకొచ్చి అందరికీ యిస్తు న్నారు.

కొందరు తీసుకుంటున్నారు, కొందరు వద్దంటున్నారు, నన్ను బలవంతం చేస్తున్నారు తాగమని.

నాకు పరమ అసహ్యకరంగా ఉంది.

తాగడమనే విషయం-అమ్మ చచ్చిపోయాక కూడా కాఫీ తాగాలా ఒరోజు కాఫీ తాగకుండా బ్రతకలేనా? కానీ తాగాను.

రావాల్సినవాళ్ళు రావడం అయిపోయింది. ఏడ్వాల్సిన వాళ్ళం ఏడ్వడం పూర్తయింది.

చావు నిశ్శబ్దంలో ఎక్కడో నవ్వుల కేరింతల పకపకల ధ్వని తరంగాలు.

మా చెల్లెలు పాపాయి మూడేళ్ళ పాపాయి చావంటే ఏమిటో తెలియని పాపాయి చావు శబ్దాన్ని బద్దలు చేస్తుంది. ఎవరో ఆ పిల్లనోరు మూస్తున్నారు.

నవ్వనీ, నవ్వనీ!

అమ్మ వెళ్ళిపోయింది-మా గుండెల్లో మంటల్ని వెనుక వదిలేసి ఆమె ముందుకెళ్ళిపోయింది.

ఆమె రూపం ఫోటోలో తప్ప మరి కన్పించని దశలోకి వెళ్ళి పోయింది.

ఆరోజు మేమంతా స్నానాలు చేయాలట–చేసాం....స్నానాలు చేసాక మరలా కాఫీలు తాగాం.

శోషొచ్చినట్టు నిద్రపోయాను. నిద్రలోనే గుబగుబలాడే దిగులు–ఉలిక్కిపడ్డట్టు లేచి కూర్చున్నాను.

మధ్యాహ్నం నిద్ర మంచిదికాదు పాపా! అని అమ్మ అటున్నట్లు క్షణకాలపు భ్రాంతి.

వెంటనే స్పృహ! మరలా దిగులుగా గుండెకొట్టుకునే శబ్దం నాకే విన్పిస్తోంది.

నా మంచంమీదే ఇంకెవరో ఇద్దరు నిద్రపోతున్నారు. అక్క కొరకు, వదిన కొరకు చూసాను.

వాళ్ళెక్కడ వున్నారో!

ఎవరో వచ్చారు. అక్క వాళ్ళతోపాటు నడిచి వాళ్ళను నా మంచం దగ్గరకు తీసుకొచ్చింది.

ఆ వచ్చినామె నా భుజంమీద చెయ్యి వేసింది. ఆమె కూడా పిన్ని వరస అవుతుంది.

"ఇంత హటాత్తుగా ఎలా పోయిందమ్మా!" అంది అక్క చెపు తోంది కధ చెప్పినట్టు చెపుతోంది.

"బాగానే వుండింది పిన్నీ! మజ్జిగ చిలుకుతూనే వుంది. తల తిరుగుతోంది అంది. అంతే విరుచుకు పడిపోయింది. డాక్టరు గారొచ్చిన అయిదు నిమిషాలకే మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది. సౌందర్యకు ఏం చెప్పాలనుకుందో ఏమీ చెప్పకుండానే వెళ్ళిపోయింది"

ఆ సీన్‌ని అమ్మ ఆ క్షణంలో నా గురించి ఆలోచించిదనే ఊహను తల్చుకున్న నాలో దిగులు నా గుండెను తడిచేసింది.

"నిజమే! సౌందర్యకు అన్యాయం జరిగిపోయింది" అంది మరలా.

నా గుండెల్లో తడి వెక్కిళ్ళుగా మారింది.

"ఏడవకు–ఏడవకమ్మా! ఏం చేయగలం చెప్పు! బ్రతికినంత కాలం నీ గురించి దిగులు పడుతూనే బ్రతికింది" అని నా ఏడుపును ఇంకా కాస్త ఎక్కువ చేసిందామె.

ఆరోజు అలా ఎందరో వస్తున్నారు.

తెలిసిన మా అమ్మ చావు గురించి మరలా అడిగి తెల్సుకుంటూనే వున్నారు.

నా కన్యాయం జరిగిపోయిందని వాపోతూనే వున్నారు వాళ్ళు అంతకంటే ఏమీ మాట్లాడలేని పరిస్థితులివి. నాకు కూడా అమ్మ విష యాలు తప్ప ఇంకేమీ వినాలని లేని క్షణాలివి.

కానీ....

రోజులు గడిచిపోతున్నాయి.

చిత్రంగా నా గుండెల్లో దిగులు పల్చబడింది.

అక్కపిల్లల్తో ఆడుకుంటూ అమ్మని మర్చిపోవటానికి ప్రయత్ని స్తున్నాను.

అమ్మ చనిపోయిన విషయం తెలియని మా అక్క ఆడబిడ్డ కూతురు వచ్చింది

"సౌందర్యా! అమ్మ నిన్ను అన్యాయంచేసి వెళ్ళిపోయింది" అన్నది" కళ్ళనీళ్ళు నింపుకుంటూ.

నేను ఆ క్షణంలో ఏదో పత్రిక చదువుకుంటూ ఆ కథలో లీనమై పోయి మా అమ్మను తాత్కాలికంగా మర్చిపోయున్నాను. మా అక్క ఆడబిడ్డ కూతురి కన్నీళ్ళు నా గుండెల్ని బరువుచేసాయి. వాటిని మరలా మండించాయి.

"అమ్మకిది వరకేమన్నా బాగలేదా?" ఇప్పటికి కొన్ని వందల సార్లు విన్న ప్రశ్న వాళ్ళు ఇప్పటికే అయిదారు మందిని వేసి వచ్చిన ప్రశ్న అది

చెప్పాను అందరికీ చెప్పిందే చెప్పాను. అమ్మకేమీ లేదని ఇది హఠాత్తుగా జరిగిందనీ.

"అవునట అత్త చెప్పింది."

'ఒకసారి తెలిసిన తరువాత మరలా అదే ప్రశ్న ఎందుకు వేస్తారో?'

తప్పదు అలాటి సమయంలో వేయడానికి ఇంకేమీ ప్రశ్న లుండవు.

నిన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోయింది నా గుండెల్లో భాష పొందని బాధ, వర్ణించడానికి చాతకాని బాధ, దిగులు.

ఆమె వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఇంకొకరు ఆ తర్వాత మరలా ఎవరో తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు, బంధువులు, స్నేహితులు.

అందరూ ఇదే ప్రశ్న, ఇదే సానుభూతి. దానితో నా గుండెలో పల్చబడుతున్న దిగులు చిక్కబడడం.

ఆరోజు మా వదిన చెల్లెలు భారతి వచ్చింది. నా ప్రక్కన కూర్చుంది ఓ రెండు నిమిషాలు మౌనంగా కూర్చుంది.

ఆ తర్వాత....

"సౌందర్యా! వంశవృక్షం సినిమా చూసావా? చాలా బాగుంది."
చూసానన్నట్టు తలూపాను.

"చాలా బాగుంది తియ్యడానికి కానీ రచయిత గుండెల్లో వున్న ఆదర్శాన్ని పూర్తిగా చూపడానికి భయపడినట్టున్నాడు అంది."

"ఆదేం."

"అమ్మాయికి రెండో పెళ్ళిచేసాడు అంతవరకు బాగానే వుందది. శ్రీనివాసాచార్యుల వారిని క్రూరుడిగా చిత్రించలేదు. వంశ గౌరవానికి ఎక్కువ యింపార్టెన్స్ ఇచ్చేవాడుగా చిత్రీకరించాడు. అదీ సమంజసం గానే వుంది.

ఆ తరం వ్యక్తి అతను కానీ బిడ్డ ఈ తరం వాడు. వాడుకూడా తల్లిని అర్థం చేసుకోకపోవడం బాగాలేదు."

"వాడు పెరిగిన వాతావరణం అలాంటిది" అన్నాను నేను—

"నిజమే కానీ ఒక సినిమా తీసినా, ఒక కథ వ్రాసినా దానికో ప్రయోజనం వుండాలి, ఇలా చేసినందువల్ల బిడ్డ తల్లులు భయపడిపోరూ మరలా పెళ్ళిచేసుకోవడానికి. వాడు తల్లిని అర్థం చేసుకున్నట్టు తాత మనసుని నొప్పించడం ఇష్టంలేక తల్లి దగ్గరకు రానట్టు పెట్టింటే చాలా బాగుండేది."

నేను మాట్లాడలేదు ఆలోచిస్తున్నాను.

సినిమా చూస్తూనంత సేపు పాపం పసిపిల్లాడు ఎంత గాయ పడ్డాడో! అనే వాడి మీద జాలి పడ్డాను. కానీ భారతి ఆలోచించినట్టు ఆలోచించలేదు.

సానుభూతికంటే పరిష్కారం అవసరం ఇప్పుడు సంధియుగంలో మన మనుష్యులకు....

ఇంకో సంగతి కూడా సౌందర్యా, శ్రీనివాసాచార్యులు తను అక్రమసంతానమనీ, తను ఆ వంశ వృక్షంలో వ్యక్తిని కాదని తెలిసాక పశ్చాత్తాపపడడం బిడ్డను తల్లికి అందివ్వడం ఏమీ బాగలేదు. అదికూడా మనం వాంఛించాల్సింది కాదు.

అతడు క్రూరుడు కాదు తల్లీ బిడ్డల మానసిక వ్యధ గ్రహించి వాళ్ళని కలిపుంటే ఎంతో బాగుండేది.

ఆమె ఎంతో చక్కగా చెపుతోంది. ఓ సినిమా చూస్తే ఇంత ఆలోచించడం నాచేత కాకపోయినా అలా ఆలోచించే వాళ్ళంటే నాకు చాలా ఇష్టం.

మా గదిలో ఇంకా ఐదారుగురు ఆడవాళ్ళు నన్ను పరామర్శించడం నాకు సానుభూతి చూపించడం అయిపోయాక వాళ్ళల్లో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటూ అప్పుడప్పుడు భారతి చెప్పేది వింటూ వున్నారు.

"అసలు కోడల్ని అలా ఎందుకు చంపాలి?"

"ఏమవసరం వుంది? అందువల్ల ఏం ప్రయోజనాన్ని సాధించాడు బాపు. ఇలాటి పెళ్ళిళ్ళు చేసుకుంటే అది విఫలమవుతాయనే సత్యాన్ని చెప్పకుంటే ఏం?"

ఆవేశ పడిపోతోంది భారతి.

ఆ గదిలోకెందుకో వచ్చి విస్తుపోయినట్టు ఓ క్షణం చూసిన మా వదిన చెల్లెలి వైపు కోపంగా చూసింది.

'భారతీ ఇలారా' అని కేకేసింది. వదినంటే మా చిన్నాన్న కొడుకు భార్య మంచమ్మాయి అందుకే స్వంత ఇంట్లో కోడలిలా చక్క పెడుతోంది.

'ఇలాటప్పుడా సినిమా కబుర్లు చెప్పేది?' అంటోంది కోపంగా నా రూము కానుకుని వున్న హాలులో నుండి నాకు వాళ్ళ మాటలు వినిపించకుండా వుండడానికి మాది బంగళా కాదు చాలా చిన్న ఇల్లు.

అందమైన మరో ప్రపంచంలో నుండి నేను వాస్తవంలో కొచ్చి పడ్డాను.

వియోగాన్ని, విషాదాన్ని, భయాన్ని, కొన్ని క్షణాలయినా మర్చిపోయేట్టు భారతి సృష్టించిన మరోలోకం నుండి మరలా విషాదం

లోకి బ్రతుకు భయంలోకి అమ్మ తాలూకు వియోగంలోకి, గుండెల్ని పిండే దిగుల్లోకి దొర్లిపోయాను.

అంతవరకు నీకెవరున్నారు పాపం అనే సానుభూతి తెచ్చుకుంటున్న ధైర్యాన్ని కోల్పోయి-నిజమే నాకింకెవరున్నారు? అనే అధైర్యములోకి ఆ భయంకరమైన సత్యంలోకి ఆ విషాదంలోకి దొర్లిపోయి-అశాంతిలో పోనిలే నాకు భారతి రావడం, ఆమె గతాన్ని, తవ్వకుండా అమ్మ లేకపోతే నేను బ్రతకలేననే సత్యాన్ని ఎత్తకుండా ఆమె చెప్పిన వంశవృక్షపు కబుర్లు నాకు కాస్త స్వాంతన నిచ్చేయి.

ఇంతలోకే దాన్ని దొంగిలిస్తూ మా వదిన—నన్ను మరలా విషాదంలోకి తోస్తూ మా వదిన—

అది పదోరోజు మర్నాడు మా అమ్మ ఆత్మశాంతి కోసం ఆమె పుణ్యలోకాలకోసం చేయబోతున్న కర్మ, ఈ పది రోజులుగా అమ్మ లేదు అనే సత్యాన్ని జీర్ణించుకుంటూ, చావు సహజమైన సంగతి అనే నిజాన్ని నమ్మడానికి ప్రయత్నిస్తే ఈ ఒంటరి తనం తప్పదు తోడు లేదని బాధ పడడం పిచ్చితనం అని నన్ను నేను ఓదార్చుకుంటూ, నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూ, అమ్మ జ్ఞాపకాలను ప్రక్కకు నెట్టేసుకుంటూ బ్రతకడానికి ప్రయత్నిస్తుంటే విచారింపులకు వచ్చేపోయే జనం నా ధైర్యాన్ని నా కొద్దిపాటి చిరునవ్వును దోచుకుంటూనే వున్నారు. మొదటి రోజుల్లో వాళ్ళ సానుభూతి బాగానే వున్నా రానురాను వీళ్ళంతా మా అమ్మ జ్ఞాపకాల్ని నా ఒంటరి బ్రతుకును గుర్తు చేయకపోతే బాగుణ్ణనిపిస్తోంది

అమ్మ చనిపోయిన మర్నాడు అక్క తన సంసారగొడవ లేదో నాకు చెపుతుంటే విస్తుపోయాను. అక్క అప్పుడే అమ్మను మర్చిపోయిందా? అని కానీ ఈరోజు తను అమ్మ గురించి తప్ప అన్ని మాట్లాడుతోంది

మా పిన్నమ్మ కోడలు వచ్చింది నేను వంటింట్లో వుంటే సరాసరి అక్కడికే వచ్చింది.

"మా అల్లుడికి బాగలేదు సౌందర్యా అందుకని ఇన్ని రోజులు

రాలేకపోయాను నా మనస్సు మాత్రం ఇక్కడే కొట్టుకు లాడుతూ వుంది పాపం పెద్దత్త ఎంత మంచిదనీ ఎప్పుడయినా వస్తే ఎంత ఆప్యాయంగా మాట్టాడేది. ఎంత ఆదరంగా పెట్టేది ? అప్పుడే వెళ్ళిపోతారా? అనేది."

ఆమె ఇంకా చెప్తోంది మా అమ్మను గుర్తు చేస్తోంది ఆమె తీపి గుర్తుల్లోకి నన్ను తోసేస్తోంది. నేను మర్చిపోదామనుకుంటున్న ఇక రాని మధురమైన రోజుల్లోకి నన్ను నెడుతోంది.

"ఎప్పుడూ అనేది పెద్దత్త నేను పోయాక పాప ఎలా బ్రతుకు తుందో అని పాపం బాధపడి పోయేది"

పెద్దత్త అప్పుడే పోతుందని నేననుకోలేదు సౌందర్యా! బాగా ఆరోగ్యంగా వుండింది కదూ! ఇంకా ఐదారేళ్ళు నీకు తోడుంటుందను కున్నాను. పాపం అమ్మ.... పాపం అమ్మ! నా కళ్ళల్లో నీళ్ళు.

నిజమే....నిజమే ఇంకో ఐదారేళ్ళున్నా అమ్మతోడు వుండుంటే ఎంత బాగుండేది? నాలో మరలా దొరకదని తెల్సినా ప్రలోభం-దాని తాలూకు అశాంతి అసంతృప్తి.

"నేను మీ అన్నతో అదే బాధపడుతున్నాను. ఇంకో నాలుగై దేళ్ళున్నా బ్రతికితే సౌందర్యకు నలభై ఏళ్ళు దాటి పోయుండేది. ఇప్పుడు పాపం వయస్సులో ఒంటరిగా ఎలా బ్రతుకుతుందా అని?"

ఇన్నాళ్ళు ఇంతమంది తెల్పిన కొత్త సత్యం అది.

భయంతో వణికిపోయాను. నిజమే ఒంటరిగా ఎలా.........ఎలా? వయస్సు ఉడిగి పోకముందే....

పెళ్ళి చేసుకోవడానికైతే సౌందర్యం కానీ మగాళ్ళకి కోరికలు తీర్చుకోను అందం లేకపోతే ఏం? వయసు చాలదా దాన్ని కాటేయను!

నేనిక్కడ ముద్దకట్టుకు పోయాను. మా వదిన వంటింట్లోనుండి మరొకర్ని పరామర్శించడానికి వెళ్ళిపోయింది. నా కాళ్ళల్లో శక్తిలేనట్లు కూలబడిపోయాను.

ఇంత పెద్ద సమస్యనెలా ఎదుర్కోను? ఎవరైనా తన్ని పెళ్ళి చేసుకుంటే?

నా ఊహకు నాకే విచారం నవ్వూ రెండూ వచ్చాయి.

పదహారేళ్ళ అందమైన వయస్సు లోనే తనకు పెళ్ళికొడుకు దొరకలేదు ఇప్పుడు ముప్పై అయిదేళ్ళ వయస్సులో దొరుకుతాడా? ఎంత పిచ్చి!

ఇలా ఒక్కొక్కరు వచ్చి విచారించి సానుభూతి చూపించి భవిష్యత్తుని గుర్తుచేసి పోతుంటే.... అమ్మ లేకుండా నేను బ్రతకలేననే బలహీనత నాలో చోటుచేసుకుంటోంది. ఆ బలహీనత నన్ను చుట్టేసి నన్ను అశక్తురాల్ని చేసి భాషకందని బాధలోకి తోసేస్తోంది.

వదిన వెళ్ళిపోయింది. నాకు నిలవలేనట్టుగా వుంది. ఈ జ్ఞాపకాల నుండి, ఈ భయాలనుండి తప్పుకోకపోతే బ్రతకలేననిపిస్తోంది.

గబుక్కున లేచాను. మూలగదిలో కెళ్ళాను. ఈ పదిరోజులుగా దుమ్ముకొట్టుకున్న వయోలిన్ తీసాను. నా పవిటతో దుమ్ము దులిపాను, శృతి చేసాను తిగ మీటాను రాగం పలికింది. అందులో లీనమై పోయాను.

నాలో భయం, నాలో విషాదం, నాలో విరక్తి నాలో దిగులు మెల్లిమెల్లిగా జారుకుంటోంది. నా గుండెలు తేలిక పడ్తున్నాయి. నేను మరో ప్రపంచంలోకి పోతున్నాను. నాకెంతో ప్రియమైన గతించిన అమ్మ జ్ఞాపకాల వేదనా ప్రపంచంలో నుండి అలజళ్ళు, సమస్యలు, వేదనలు లేని అందమైన ప్రపంచంలో కెళ్ళిపోతున్నాను. తలుపు చప్పుడయింది. నేను తల తిప్పలేదు. నా చెయ్యి ఎవరో పట్టుకున్నారు.

"సౌందర్యా" అక్క ముఖంలో జాలి "లేమ్మా ఇప్పుడిలా వాయించుకోకూడదు వచ్చేపోయే బంధువులు బాగుండదు"

నా చేతుల కదలిక ఆగిపోయింది. శబ్దం నిశ్శబ్దమై పోయింది. నా గుండెల్లో పరవశం విషాదమైపోయింది. మరలా ఈ లోకంలోకి వచ్చేసాను.

ఏమిటీ పద్ధతులు? ఏమిటీ ఆచారాలు? సానుభూతి ఎంత హీనమైంది.

ఎందుకొచ్చాయసలీ ఆచారాలు! మర్చిపోతున్న దిగులును రెచ్చగొట్టే ఆచారాలు!

ఆమె నీకు అండగా వుండింది. ఇప్పుడదీ పోయింది. అని మిగిలి పోయిన వాళ్ళ హీన జీవితాల్ని గుర్తు చేసే ఈ ఆచారం ఎంత క్రూరమైంది!

ఎందుకీ సానుభూతి? ఎవరడుగుతున్నారిది కావాలని.

నేను నిగ్రహించుకునే స్థితి దాటి పోయాను.

ఈ రకం సానుభూతిని భరించే నిగ్రహాన్ని కోల్పోయాను.

"దయచేసి మా అమ్మ గురించి నాముందు మాట్లాడకండి" అరిచాను, ఏడ్చాను, జుట్టు పీక్కున్నాను.

అందరూ తెల్లబోయారు. ముక్కుమీద వేలేసుకున్నారు.

"ఎంత కృతజ్ఞతలేదు. ఈ పిల్లకొరకు ఎంత తాపత్రయపడింది సత్యవతి. ఈ పిల్లచూడు ఏమంటోందో!"

నేనేమి మాట్లాడుతున్నానో నాకే తెలియలేదు. నేనేం వింటున్నానో నాకు అర్థం కావడంలేదు. నేను పగిలిపోయాను.

కానీ తనను విచారించడానికి వచ్చేవాళ్ళదీ తప్పులేదు. కాకపోతే రాలేదంటారు. అలా మాట్లాడేవాళ్ళదీ తప్పులేదు. అంతకంటే భిన్నంగా మాట్లాడితే మనమే అనుకుంటాం వాళ్ళని చచ్చిపోయిన వాళ్ళమీద ప్రేమ లేదని.

సో....

ఆచారమా! నువ్వు మారు—కాస్తమారు-మారి మిగిలిన వాళ్ళకు ధైర్యాన్నివ్వు అంతేకాని సానుభూతి పేరిట వాళ్ళను హింసించకు.

*